

క్రీడాకారులకు మంచి భవిష్యత్తు

పరిగి,సెప్టెంబరు 10: క్రీడాకారులకు మంచి భవిష్యత్తు ఉంటుందని మునిసిపల్ ఛైర్మన్ అశోక్ అన్నారు. మంగళవారం పరిగిలో జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల ఎంపికలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని సూచించారు. పరిగి నుంచి జాతీయ స్థాయిలో రాణించి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు. క్రీడాకారులకు తమవంతుగా సహాయసహకారాలు ఉంటాయని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పారిశుధ్య పనులు చేపట్టేందుకు
బాధ్యతలు తీసుకోవాలి

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, సెప్టెంబరు 10: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య పనులు చేపట్టేందుకు బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా మహిళా సమాఖ్య సభ్యులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని స్త్రీశక్తి భవన్‌లో పాఠశాలల్లో పారిశుధ్య పనులు, అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులు, వరిధాన్యం సేకరణకేంద్రాల్లో చెల్లింపుల విషయంపై జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల సభ్యులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పాఠశాలల్లో పారిశుధ్యంపై ఆదర్శ పాఠశాల కమిటీకి నిర్వహణ బాధ్యతను అప్పగించాలని సర్కారు నిర్ణయం తీసుకోవడం జరిగిందని, దీనికి పాఠశాల కమిటీలు, ప్రధానోపాధ్యాయుల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాలు బాధ్యతలను తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో వరిధాన్యం సేకరణ కేంద్రాలను నిర్వహించిన మహిళా సంఘాలకు రావలసిన సర్వీస్ ఛార్జీలకు (కమిషన్) సంబంధించి రూ. 2.47కోట్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఆసక్తిగల మహిళలు సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనుల బిల్లుల పరిశీలన పూర్తిచేసి సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల కింద 924పాఠశాలలు ఎంపిక చేయడం జరిగిందని, ఇప్పటికే 450 పాఠశాలకు సంబంధించి చెల్లింపులు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో శ్రీనివాస్, ఏపీడీ సరోజ, డీపీఎం రామమూర్తి, డీఈవో రేణుకాదేవి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అలివేలు తదితరులు పాల్గొన్నారు.



నందుకు సభ్యత్వాన్ని అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

మెదక్ ఎంపీ సీటు గెలుపునకు
బీఆర్‌ఎస్ ఖర్చు రూ.250 కోట్లు

» రాష్ట్రంలో బీజేపీదే భవిష్యత్తు » మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

వికారాబాద్, సెప్టెంబరు 10: మెదక్ ఎంపీ స్థానం గెలుసుకునేందుకు బీఆర్‌ఎస్ పార్టీ రూ.250 కోట్లు ఖర్చు చేసిందని, అయినా నా నమ్మకం నన్ను గెలిపించిందని, దేశం, ప్రతీ కార్యకర్త గురించి ఆలోచించే ఏకైక పార్టీ బీజేపీయేనని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించి మాట్లాడారు. తెలుగు మాట్లాడడం రాని రాహుల్‌గాంధీ తెలుగు భాష కోసం అమెరికాలో మాట్లాడుతున్నాడన్నారు. నరేంద్రమోదీ పాలనలో దేశంప్రపంచంలోనే 5వస్థానంలో ఉందని, భవిష్యత్తులో నెంబర్‌వన్ స్థానంలో ఉండనందని పేర్కొన్నారు. హైడ్రా గురించి మాట్లాడుతుంటే రఘునందన్‌రావు రేవంత్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్నాడని బీఆర్‌ఎస్ నాయకులు సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. భవిష్యత్తులో బీజేపీ అధికారంలోకి వస్తుందని, రాష్ట్రంలో అధికార పార్టీకి సమానంగా బీజేపీకి సీట్లు రావడం అందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, రాష్ట్ర నాయకుడు సదానందారెడ్డి, శివరాజ్, నాయకులు విజయ్ భాస్కర్‌రెడ్డి, వడ్ల నందు, శిరీష, నరోత్తంరెడ్డి పాల్గొన్నారు. అనంతరం అనంతగిరి అనంతపద్మనాభస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

భూముల విలువ రూ.కోట్లకు పెరగడంతో రియల్ వ్యాపారులు చెరువు, కుంటలను సైతం వదలడం లేదు. మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామ పరిధిలోని అలీ చెరువును ఇష్టారాజ్యంగా ఆక్రమించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసి నిర్మాణాలు సైతం చేపట్టారు. ఓ రియల్ సంస్థ చెరలో చిక్కిన ఈ చెరువు అంతకంతకూ కుచించుకుపోయి తన అస్థిత్వాన్నే కోల్పోయే పరిస్థితి నెలకొంది.



కబ్జాకోరల్లో చిక్కుకున్న కాగజ్‌ఘట్ అలీ చెరువు

అలీ చెరువు ఆగమాగం!



ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన నిర్మాణాలు

కబ్జాకోరల్లో కాగజ్‌ఘట్ అలీ చెరువు.. చెరబట్టిన ఓ రియల్ సంస్థ

» ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, నిర్మాణాలు
» గత ప్రభుత్వ పెద్దల సహకారంతో నిర్వాకం
» సుమారు ఎనిమిది ఎకరాలు స్వాహా
» అస్తిత్వాన్ని కోల్పోతున్న చెరువు.. పట్టని యంత్రాంగం
» ఎఫ్‌టీఎల్ హద్దుల నిర్ధారణకు కోర్టులో కేసు

ఇబ్రహీంపట్నం/మంచాల, సెప్టెంబరు 10 : మంచాల మండలం కాగజ్‌ఘట్ గ్రామ తూర్పు వైపున ఉన్న ఈ అలీ చెరువు సుమారు 25 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉంటుంది. కాగజ్‌ఘట్‌పై భాగంలోని జాపాల రిజర్వుడు ఫారెస్టు, గడ్డమల్లాయ గూడ, గున్‌గల్ రెవెన్యూ పరిధిలోని వరద కాల్వలు, కుంటల ద్వారా ఈ చెరువుకు వర్షం నీరు వచ్చి చేరుతుంది. గొలుసుకట్టుగా తదుపరి వరద ప్రవాహం నోముల, లింగంపల్లి, రాయపోల్‌ల చెరువులను కలుపు

కబ్జాల పర్వం 11



ఎఫ్‌టీఎల్‌లో పరిధిలో నింపిన మట్టి

కుంటూ ముందుకు వెళ్తుంది. ఇంతటి ప్రాచుర్యం గల అలీ చెరువు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కి అస్తిత్వాన్ని కోల్పోతోంది. మొదట్లో వరద కాల్వలతో ప్రారంభమైన కబ్జాల పర్వం ఎఫ్‌టీఎల్‌ను దాటి శిఖం దాకా వచ్చింది. ఎఫ్‌టీఎల్ పరిధిలోనే రియల్ సంస్థ వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, భవన నిర్మాణాలు ఉన్నాయి.

అంతా పథకం ప్రకారమే..

ఒక పథకం ప్రకారం ఈ వ్యవహారాలన్ని కొనసాగుతున్నా చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వ యంత్రాంగం చోద్యం చూస్తోంది. అప్పటి ప్రభుత్వ పెద్దల అండతో ఈ వెంచర్‌లో కలగలిసిన ప్రభుత్వ భూమికి అనుమతి పత్రాలు అప్పట్లో సదరు వెంచర్ నిర్వాహకులకు అధికార యంత్రాంగమే ఇచ్చినట్లు తెలుస్తోంది. రెండేళ్ల క్రితం ఇక్కడ జరిగిన ఓ శుభ కార్యానికి ప్రభుత్వంలో ఉన్న పెద్దలు హాజరు కావడంతో ఆగమేగాలమీద సాగర్ ప్రధాన రహదారి ఆగాపల్లి నుంచి ఇక్కడకు వచ్చే ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టి రాత్రికి రాత్రే డబుల్ రోడ్డుగా మార్చారంటే స్వామి భక్తి ఏ మేరకు ఉందో తెలుసుకోవచ్చు. మొత్తంగా ఈ చెరువు సుమారు ఏడెనిమిది ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు తెలుస్తోంది.

ఎవరినీ ఉపేక్షించేది లేదు

అలీ చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాపై ఫిర్యాదులు అందాయి. ఈ ఫిర్యాదులకు సంబంధించి క్షేత్రస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేశాం. అధికారుల ఆదేశాల మేరకు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇందులో ఎవరినీ ఉపేక్షించేది లేదు.

-సురేఖ, డీఈఈ, ఇబ్రహీంపట్నం

కోర్టు పరిధిలో వివాదం

కాగజ్‌ఘట్ అలీ చెరువు వివాదం తాజాగా కోర్టు పరిధిలోకి వెళ్లినట్లుగా అధికారులు చెబుతున్నారు. ఇటీవల చెరువు ఎఫ్‌టీఎల్ కబ్జాపై స్థానిక మత్స్యకారులు ఆందోళనలు చేసి సాగునీటిశాఖ, రెవెన్యూ యంత్రాంగానికి ఫిర్యాదు చేశారు. దీంతో సదరు వెంచర్ నిర్వాహకులు స్వయంగా కోర్టును ఆశ్రయించి చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిని నిర్ధారించాలని తదుపరి ఎఫ్‌టీఎల్‌లోకి వచ్చే తమ నిర్మాణాలను తొలగింపుకు కట్టుబడి ఉంటామంటూ విన్నవించుకున్నట్లు తెలిసింది. దీనిపై స్పందించిన కోర్టు వాస్తవ నివేదిక కోసం నీటిపారుదల శాఖను ఆదేశించడం జరిగిందని తెలిసింది. దీంతో నీటిపారుదల శాఖ నివేదిక కోర్టులో సమర్పించిన తదనంతరమే అలీచెరువు కబ్జాలపై తదుపరి చట్టపరమైన చర్యలు ఉండే అవకాశం ఉంది.



ఎఫ్‌టీఎల్‌లో వేసిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు

వెంచర్ రోడ్డుపైనా వివాదమే..

వెంచర్ కోసం ఏర్పాటు చేసి ప్రధాన రోడ్డుపైనా వివాదం నెలకొంది. ప్రధాన రహదారిపైనా వివాదమే నెలకొని ఉంది. ఈ రోడ్డును అసైన్డు భూమి సర్వే నం.22 లోనుండే వేశారు. ఈ రోడ్డు నిర్మాణంపై విమర్శలు రావడంతో అప్పట్లోనే అనేక వివాదాలు నెలకొని ఫిర్యాదులు, విచారణలు జరగాయి. చాలా కాలం పాటు రహదారి విస్తరణ పనులను స్థానికులను అడ్డుకున్నారు. అనంతరం సదరు యాజమాన్యం తమ పరపతితో ప్రభుత్వ అనుమతులు సాధించి రాత్రికి రాత్రే సీసీ రోడ్డు వేసిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

నిమజ్జనానికి
కట్టుదిట్టమైన చర్యలు

మేడ్చల్‌టౌన్/శామీర్‌పేట, సెప్టెంబరు 10 : వినాయక నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా అధికారులు కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ గౌతమ్ అన్నారు. మంగళవారం మేడ్చల్ పెద్ద చెరువు, శామీర్‌పేట పెద్ద చెరువు, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని సుతారిగూడ చెరువులను ఆయన సందర్శించి నిమజ్జనం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువుకట్టలపై గుంతలను పూడ్చాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో నిమజ్జనం కార్యక్రమం



చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

ముగు సేలా చూడాలని తెలిపారు. భద్రతా చర్యల గురించి మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ రాములు, శామీర్‌పేట ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌లు కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మర్రి దీపికానర్సింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు నాగిరెడ్డి, స్వామినాయక్, ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సక్రమం పేరుతో అక్రమం!

» 'డబిల్‌పూర్'లో అక్రమ లేఅవుట్ » గ్రామ కార్యదర్శి వద్దన్నా ఆగని రిజిస్ట్రేషన్లు » సబ్ రిజిస్ట్రార్‌పై మండిపడుతున్న గ్రామస్తులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 10 : అక్రమ లేఅవుట్‌లను నియంత్రించడానికి ఓవైపు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతుండగా, మరోవైపు చట్టంలోని లొసుగులను ఆధారం చేసుకుని కొందరు నిబంధనలకు విరుద్ధంగా కాగితాలపై లేఅవుట్‌లు తయారు చేసి స్థలాలను విక్రయిస్తున్నారు. మేడ్చల్ మండలంలోని డబిల్‌పూర్‌లో అక్రమ లేఅవుట్‌ను గుర్తించిన గ్రామస్తులు పంచాయతీ కార్యదర్శి కి ఫిర్యాదు చేశారు. దీంతో కార్యదర్శి ప్లాట్ల రిజిస్ట్రేషన్లను నిలిపి వేయాలని కోరుతూ మేడ్చల్ సబ్‌రిజిస్ట్రార్‌కు గత ఏప్రిల్ 16న లేటర్ సమర్పించారు. అయినప్పటికీ ఆగస్టు 18న స్థలానికి సంబంధించి కొన్ని రిజిస్ట్రేషన్లు జరిగినట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్లాట్లుగా చూపిస్తున్న స్థలాన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యలయం వారు ఓపెన్ లాండ్ కింద రిజిస్ట్రేషన్లు చేయటంతో గ్రామస్తులు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తీరుపై మండిపడుతున్నారు. అక్రమమంటూ.. స్వయాన పంచాయతీ కార్యదర్శి చేసిన ఫిర్యాదును సబ్‌రిస్ట్రార్ కార్యాలయం అధికారులు పట్టించుకోక పోవడం లేదు. ప్రస్తుతం కాగితాలపై ఉన్న వెంచర్‌పై వివాదం కొనసాగుతున్నందున అప్రమత్తమైన సదరు రియల్టర్లు ఆ స్థలంలో ఎలాంటి హద్దురాళ్ళు పాతకుండా ఉట్టిగా వదిలేసి అక్రమ వ్యవహారాన్ని సక్రమంగా చేసుకునే పనిలో పడినట్లు తెలుస్తోంది.



లేఅవుట్ తయారు చేసిన స్థలం

ఎలా మోసం చేశారంటే..

డబిల్‌పూర్ గ్రామ పరిధిలో ఓ బడా రియల్టర్ ముగ్గురు భూ యజమానుల వద్ద దాదాపుగా 30 ఎకరాలు కోనుగోలు చేసి వెంచర్ ఏర్పాటు చేశారు. అందులో ఇద్దరు భూ యజమానులు తమకు చెందిన సర్వే నంబర్ 112/పార్ట్ 113/పార్ట్‌లో నాలా కన్వర్షన్ చేసిన 5,582 చదరపు గజాల స్థలం విక్రయించకుండా తమవద్దే ఉంచుకున్నారు. ఈ స్థలం పొనాది (ఎడ్ల బండ్ల దారి)కి, హెచ్‌ఎండీఏ వెంచర్‌కు మధ్యన ఉండటంతో స్థలానికి అనూహ్యంగా ధర పలుకుతోంది. దీంతో ఆ భూయజమానులు బడా రియల్టర్‌కు విక్రయించకుండా మిగిలిన 5,582 గజాల భూమిని మేడ్చల్‌కు చెందిన మరో నలుగురు రియల్ వ్యాపారులకు విక్రయించారు. దీంతో ఆస్థలాన్ని నలుగురు వ్యక్తులు తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. బడా రియల్టర్ చేసిన వెంచర్ రోడ్లను వారు చేసిన అక్రమ లేఅవుట్‌కు సంబంధించిన రోడ్లుగా చూపించి క్రయ విక్రయాలు సాగిస్తున్నారు. కాగితాలపై 29 ప్లాట్లుగా లేఅవుట్ తయారు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు..

ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేస్తాం



గ్రామ కార్యదర్శి లేటర్ ఇచ్చినా పట్టించుకోకుండా రిజిస్ట్రేషన్లు చేయడం శోచనీయం. నిబంధనల ప్రకారం అక్రమ లేఅవుట్‌కు ఆనుకుని ఉన్న హెచ్‌ఎండీఏ వెంచర్‌లోని 60 ఫీట్ల రోడ్డును గ్రామపానాదికి కలిపి గ్రామస్తులకు రాకపోకలు సులువు చేయాలని కోరినప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై కలెక్టర్, ఐజీ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేస్తాం

- రాజమల్లారెడ్డి, డబిల్‌పూర్ మాజీ సర్పంచ్

ఎల్‌ఆర్‌ఎస్ వర్తించదు



ఎల్‌ఆర్‌ఎస్ నిబంధన ప్రకారం 2020ఆగస్టులోపు గుర్తించిన అన్ని రకాల లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మించుకునేందుకు అనుమతి లభిస్తుంది. అతరువాత ఏవరైనా అక్రమంగా లేఅవుట్ చేసి ప్లాట్లు విక్రయిస్తే వాటిలో నిర్మాణాలకు అనుమతులు లభించవు. ప్లాట్లు కొన్న వారికి యజమానిగా హక్కు లభిస్తుంది తప్పా, నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణానికి అనుమతి ఉండదు.

-సునీత, ఎంపీవో, మేడ్చల్

నిబంధనలకు లోబడే రిజిస్ట్రేషన్లు

ఒకసారి రిజిస్ట్రేషన్ అయిన ఆస్తిని తిరిగి రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఉంది. నిబంధలనకు లోబడి తమ కార్యాలయంలో రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. రిజిస్ట్రేషన్ చేస్తున్న ఆస్తి సక్రమమా...అక్రమమా...అన్న విషయం పక్కన బెడితే నిబంధనల ప్రకారం రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆస్తికి సంబంధించిన దస్తావేజులు సక్రమంగా ఉన్నాయా... లేవా? అన్న విషయాన్ని పరిగణలోకి తీసుకుని రిజిస్ట్రేషన్లు చేస్తాం.

- రేణుక, సబ్‌రిజిస్ట్రార్

అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

కందుకూరు, సెప్టెంబరు 10: వర్షాల నేపథ్యంలో సోకే అంటు వ్యాధుల పట్ల ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, పాఠశాలల ఆవరణ, ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ ఉండకుండా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఎండీవో సరిత, మండల విద్యాధికారి మనోహర్‌లు ఆదేశించారు. మంగళవారం మండల కేంద్రంలోని కొత్తగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూర్బాగాంధీ బదిరుల ఉన్నత పాఠశాలలో వైద్యాధికారులు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో వారు పాల్గొని మాట్లాడారు. కిచెన్ షెడ్డు, భోజన వసతి, విద్యా ప్రమాణాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో రవీందర్, పాఠశాల ప్రిన్సిపాల్ తీగల భార్గవి, ఆశావర్కర్ చీమల అనిత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

దౌల్తాబాద్ పరిధిలోని గురుకులాన్ని తరలించొద్దు

కొడంగల్, సెప్టెంబరు 10: ఎన్నో సంవత్సరాలుగా విద్యకు ఆమడ దూరంలో ఉన్న దౌల్తాబాద్ ప్రాంతానికి మంజూరైన గురుకుల పాఠశాలను ఇతర ప్రాంతాలకు తరలించొద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని నీటూర్ పరిధిలో మంజూరైన గురుకుల పాఠశాలను తరలించొద్దంటూ మంగళవారం కొడంగల్ కడా కార్యాలయం ముందు ఆయా గ్రామాల విద్యార్థులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ.. మండలంలోని నీటూర్, కొడీడ్, నర్సాపూర్ గ్రామాల విద్యార్థులకు విద్యాభివృద్ధికి అవకాశం వచ్చినా ఇతర ప్రాంతాలకు తరలించడం సరైంది కాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి వెనకబడిన ప్రాంతం దౌల్తాబాద్ మండలంలోనే గురుకుల పాఠశాల కొనసాగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు కొడంగల్‌లోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని వాపోయారు. అనంతరం కొడంగల్ అంబేడ్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించగా పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు మహేశ్, రాఘవేందర్, నరేశ్, జావీద్, పరమేశ్, రవి, పాష, కృష్ణ, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, మాజీ సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



కడా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

ఎరుపెక్కిన ఆకాశం



సూర్యాస్తమయం వేళ ఆకాశ ఎరుపు రంగులోకి మారి కనువిందు చేసింది. మంగళవారం సాయంత్రం 6.60గంటల ప్రాంతంలో ఆకాశం ఒక్కసారిగా ఎరుపురంగులోకి మారింది. నీలి, ఎరుపు రంగుల కలయికతో ఆకాశంలో కనువిందు చేసింది. సూర్యుడు అస్తమిస్తున్న వేళ ఈ రంగులను చూసి ఆశ్చర్యపోయారు. ఈ దృశ్యాన్ని తాండూరు మండల పరిధిలోని తాండూరు-చించోళి మార్గంలో ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించింది.

- తాండూరు రూరల్, సెప్టెంబరు 10

వర్షాలతో కూలిన ఇళ్లకు పరిహారం పెంపు



బషీరాబాద్‌లో ఇటీవల వర్షానికి కూలిన ఇళ్లు

బషీరాబాద్, సెప్టెంబరు 10: వర్షాలతో కూలిన ఇళ్లకు చెల్లించే పరిహారాన్ని ప్రభుత్వం ఏట్టకేలకు పెంచుతూ సర్క్యులర్ జారీ చేసింది. ఈ మేరకు బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ మంగళవారం ధ్రువీకరించారు. వర్షాలకు ఇళ్లు పాక్షికంగా కూలిపోతే గతంలో ప్రభుత్వం రూ.3,200 పరిహారం చెల్లించేదన్నారు. ఈ పరహారాన్ని ప్రస్తుతం రూ.16,500లకు పెంచుతూ ప్రభుత్వం కొత్త జీవో జారీ చేసిందని తెలిపారు. మండల వ్యాప్తంగా ఇటీవల కురిసిన వర్షాలకు 19మంది ఇళ్లు పాక్షికంగా కూలిపోయినట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ సారి వర్షాలకు కూలిన ఇళ్లపై విచారణ జరిపించి, బాధిత కుటుంబాల జాబితాను ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఇకపై ఇళ్లు కూలిన బాధిత కుటుంబాలకు కొత్త జీవో ప్రకారం పరిహారం అందనుందని ఆయన వెల్లడించారు.

షిర్డీ సాయినాథుడి సేవలో స్పీకర్



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, సెప్టెంబరు 10: తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మహారాష్ట్రలోని షిర్డీ సాయినాథుడి సన్నిధిలో మంగళవారం ప్రత్యేకపూజలు చేశారు. మహారాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి రాధాకృష్ణ వీకే పాటిల్‌తో కలిసి సాయినాథుడి మహా సమాధిని దర్శించుకుని హారతిలో పాల్గొన్నారు. సభాపతికి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ సభ్యులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌కుమార్‌తో పాటు ఓఎస్‌డీ పి.వెంకటేశం, సోషల్ మీడియా స్టేట్‌సెక్రటరీ రఘుపతిరెడ్డి, నాయకులు రాములు యాదవ్, అనిల్ యాదవ్‌లు పాల్గొన్నారు.

వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలి



కాగ్నా వాగును పరిశీలిస్తున్న వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి

యాలాల, సెప్టెంబరు 10: వినాయక నిమజ్జనాలు ప్రశాంతంగా నిర్వహించాలని వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి అన్నారు. మండల పరిదిలోని కోకట్ కాగ్నా వాగు వద్ద జరుగు వినాయక నిమజ్జన స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. తాండూరు నుంచి కోకట్ కాగ్నా వాగు వరకు ట్రాఫిక్ జామ్ కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. యువకులు మద్యం సేవించి ఉండరాదన్నారు. కోకట్ కాగ్నా వాగు వద్ద పోలీస్ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వసతి గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలి

రంగారెడ్డి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్



బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న డీడీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, సెప్టెంబరు 10 : వసతి గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలని, ముఖ్యంగా వంట గదులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ దామోదర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ వసతి గృహాలు, మోడల్ స్కూల్‌లోని వంట గదులను వైద్యులతో కలిసి ఆయన సందర్శించారు. విద్యార్థుల ఇబ్బందులను అడిగి తెలుసుకోవడంతో పాటు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కూరగాయలను అరగంట పాటు ఉప్పునీళ్లలో నానబెట్టి.. శుభ్రంగా కడిగి ఆరబెట్టిన తర్వాతనే వంట చేయాలని సూచించారు. డాక్టర్లు వారానికొకసారి పిల్లలను పరీక్షించి వైద్యం అందిస్తారని చెప్పారు. ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఉన్నా తమకు సమాచారం అందించాలని, ఆరోగ్య కార్యకర్తలు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు. వైద్యులు వేదశ్రీ, సీహెచ్‌వో సంతోష్, వైద్యసిబ్బంది తదితరులు ఉన్నారు.

చదువుతోనే సమాజంలో మార్పు సాధ్యం

దళిత స్త్రీ శక్తి సంఘం జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ



చేవెళ్ల ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న గడ్డం ఝాన్సీ

చేవెళ్ల, సెప్టెంబరు 10 : సమాజంలో మార్పు రావాలంటే చదువే పదునైనా అయుధమని దళిత స్త్రీ శక్తి సంఘం జాతీయ కన్వీనర్ గడ్డం ఝాన్సీ తెలిపారు. మంగళవారం దళిత స్త్రీ శక్తి ఆధ్వర్యంలో మండలంలోని చేవెళ్ల, చన్వెల్లి తదితర గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది చదువుకోకపోవడంతోనే నిత్యం చిన్నచిన్న సమస్యలకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. జ్ఞానవంతులు కావాలంటే విద్యపై దృష్టి పెట్టాలన్నారు. చదువుతోనే ఆర్థికంగా నిలదొక్కుకుంటారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలో మరిన్ని సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలన్నారు. సైకాలజిస్టు లక్ష్మీ, దళిత సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్పన్‌పల్లి చెరువులో ఏర్పాటు చేసిన బోటింగ్ హౌస్‌లు



విడ్రా ఏర్పాటయ్యేనా?

వికారాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఏర్పాటుకు పెరుగుతున్న మద్దతు

ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని వినతి

వికారాబాద్, సెప్టెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో హైడ్రా తరహాలో జిల్లాలోనూ వికారాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (విడ్రా) ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల్లో వ్యక్తమవుతోంది. జిల్లాలో పలు చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని భూభాగం ఆక్రమణలకు గురైన నేపథ్యంలో హైడ్రాతరహాలో జిల్లాలోనూ విడ్రా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలో చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూ ములను ఆక్రమించుకుని ప్లాట్లు చేసి విక్రయించినా చెరువుల స్థలాల్లోనే అక్రమ నిర్మాణాలు చేపట్టినా అధికార యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం హైడ్రా చట్టం తీసుకువచ్చి చెరువుల సరిహద్దుల్లో అక్రమంగా చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించేలా చర్యలు చేపట్టడంతో అక్రమార్కుల గుండెల్లో గుబులు రేగుతున్న విషయం తెలిసిందే.

ధైర్యం చేయని అధికారులు

హైడ్రా స్వయం ప్రతిపత్తి సంస్థ ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం మోపుతోంది. చెరువులు, కుంటలను ఆక్రమణలు చేసి నిర్మాణాలు చేపట్టిన వారి వెన్నులో వణుకు పుడుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ అలాంటి వ్యవస్థ ఏర్పాటు చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. చెరువుల్లో వెలసిన అక్రమ నిర్మాణాలకు కొందరు రాజకీయ నేతల అండదండలు ఉండడంతో వాటిని కూల్చేందుకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు ధైర్యం చేయలేకపోతున్నారు. హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమించి చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించే విషయంలో హైడ్రా కఠినంగా వ్యవహరిస్తుండడంతో జిల్లాలోనూ ఏర్పాటు చేయాలనే డిమాండ్ పెరుగుతోంది. చెరువులు, కుంటలను ఆక్రమించుకుని నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు హైడ్రాతరహా వ్యవస్థను జిల్లాలోనూ ఏర్పాటు చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఆక్రమణల్లో కొన్ని..

వికారాబాద్ పట్టణ ప్రజలకు తాగునీటిని అందించే శివసాగర్ చెరువు 180 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోనే కొత్త వెంచర్లు, నిర్మాణాలు ఏర్పాటు చేసినా అధికార యంత్రాంగం అధికార యంత్రాంగం మాత్రం పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. వికారాబాద్ పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న కొంపల్లి చెరువు బఫర్‌జోన్ ఆక్రమణకు గురైంది. సర్పన్‌పల్లి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోనే అక్రమంగా కాటేజీలు నిర్మించారు. చెరువు బఫర్‌జోన్‌ను తమ వ్యాపార అవసరాలకు రిసార్ట్‌ల యజమానులు వినియోగించుకుంటున్నా అధికార యంత్రాంగం తమకు పట్టనట్లు వ్యవహరించడం గమనార్హం. సర్పన్‌పల్లి చెరువులో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించేలా చర్యలు తీసుకున్న అప్పటి వికారాబాద్ తహసీల్దార్‌ను ఓ ముఖ్య రాజకీయ నేత జిల్లా శివారు మండలానికి బది లీ చేయించిన విషయం తెలిసిందే. తాండూరు పట్టణంలో చిలుక వాగు ఆక్రమణకు గురైంది. గొల్ల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కాలనీలను వరద నీరు ముంచెత్తడంతో వరద నీరు ఇళ్లల్లోకి వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడిన విషయం తెలిసిందే. కొడంగల్ పట్టణంలోని కొందరు కుంటస్థలాన్ని ఆక్రమించి ప్లాట్లు చేసి విక్రయించిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలు ఉన్నా యి. క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే చెరువుల శిఖం భూములు ఆక్రమణలకు గురైనట్లు స్పష్టమవుతున్నా.. మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పరిగిలోని కొత్త చెరువు (కుంట)ఆక్రమణకు గురైంది. ప్లాట్లు చేసి విక్రయించారు. దీంతో పెద్ద ఎత్తున్న నిర్మాణాలు చేపట్టారు.

సర్వే..పదేళ్లుగా ప్రతిపాదనకే పరిమితం..

చాలా కాలంగా చెరువులు, కుంటల హద్దులు గుర్తించే ప్రక్రియ వాయిదా పడుతూ వస్తోంది. చెరువులు, కుంటలను ఆక్రమణల నుంచి పరిరక్షించేందుకు సర్వే చేసి తాజాగా హద్దులు ఏర్పాటు చేయాలని పదేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఆ ప్రతిపాదన ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. గతంలో గుర్తించిన హద్దులకు, తాజాగా సర్వేలో గుర్తించిన హద్దులను పోలిస్తే ఏ మేర ఆక్రమణలకు గురయ్యారనేది స్పష్టత రానుంది. పట్టణ ప్రాంతాల్లోని చెరువులు, కుంటలే కాకుండా గ్రామాల్లోని చెరువులు, కుంటలు కూడా ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. ఆక్రమణలను నిరోధించేందుకు పట్టణ ప్రాంతాలతో గ్రామ స్థాయిలో విలేజ్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

చెరువుల నిర్వహణ, పర్యవేక్షణ కొరవడడంతో అభివృద్ధి పేరుతో ఆక్రమణలు పెరిగి చెరువుల్లో నిర్మాణాలు వెలుస్తున్నాయి. జిల్లాలో 1182 చెరువులు ఉండగా, ఈ చెరువుల కింద 79,355 ఎకరాల ఆయకట్టు ఉంది. భూముల ధరలు పెరగడంతో పట్టణ ప్రాంతాల్లోని చెరువుల శిఖం భూముల ఆక్రమణ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల ఏర్పాటుకు సర్వే నిర్వహించి హద్దులు ఏర్పాటు చేయాల్సిన నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఫలితంగా పట్టణ ప్రాంతాల్లోని చెరువులు ఆక్రమణలకు గురై వ్యాపారులకు కల్పతరువుగా మారుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చెరువుల పక్కన భూములు కొనుగోలు చేసిన బడాబాబులు, రాజకీయ నేతలు, అధికారుల అండదండలతో శిఖం భూములను ఆక్రమించుకుంటున్నారు. ఆక్రమణలను నిరోధించాల్సిన సంబంధిత అధికారులు పట్టనట్లు వ్యవహరించడంతో అక్రమార్కుల ఆగడాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు



వరినాట్లు వేస్తూ నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు(ఫైల్)



కంకల్‌లోని గుంతల రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేసిన దృశ్యం

పూడూరు, సెప్టెంబరు 10: మండల పరిధిలోని కంకల్ గ్రామంలో రోడ్లపై పడిన గుంతల్లో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి మంగళవారం నిరసన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే.ఆగస్టు 27న ఆంధ్రజ్యోతిలో 'ప్రమాదకరంగా రోడ్లు' శీర్షికతో ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మంగళవారం గుంతల రోడ్లపై కంకర, మట్టి వేసి తాత్కాలిక మరమ్మతులు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.పూడూరు మండల కేంద్రానికి రోడ్డు, మండల కేంద్రం నుంచి మైసమ్మగడ్డ తండాకు వెళ్లే రోడ్డు, పూడూరు నుంచి మేడికొండ వెళ్లే రోడ్డు, బిజాపూర్-సోమన్‌గుర్తి మన్నెగూడ-చెన్‌గోముల్ రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో ద్విచక్రవాహనాలు, బస్సులు, లారీలు, ఆటోలు వెళ్లినా ప్రమాద భరితంగా ఉండేవి. కనీసం గ్రామాల్లో రోడ్ల పరిస్థితి కూడా అదేవిధంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అంతేకాకుండా కంకల్ గ్రామంలో రోడ్లపై పడిన గుంతల్లో బీజేపీ నాయకులు వరినాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. వరుస సంఘటనలు ప్రచురితం కావడంతో ఎట్టకేలకు అధికారులు స్పందించి తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టారు. కనీసం తాత్కాలికంగా అయినా మరమ్మతులు చేసి కొంత ఇబ్బందులు తొలగించారని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్రిబుల్‌ఆర్ పనులపై తుది నిర్ణయం తీసుకోలేదు

కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



గుడి తండా వద్ద మార్కింగ్ ఇచ్చిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, సెప్టెంబరు 10: రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) దక్షిణ భాగం పనుల నిర్వహణ విషయంలో ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని.. ప్రజలు, రైతులు ఆందోళన చెందవద్దని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ గేటు సమీపంలోని గుడితండాను మంగళవారం ఎమ్మెల్యే సందర్శించారు. తండా సమీపంలో ఇటీవల రీజినల్ రింగురోడ్డుకు మార్కింగ్ చేశారు. తమ తండా, భూములు కోల్పోతామని గిరిజన ప్రజలు, రైతులు ఆందోళన చెందుతూ ఎమ్మెల్యేను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. దాంతో ఎమ్మెల్యే తండాలో పర్యటించి గిరిజనులతో కలిసి రీజినల్ రింగ్ రోడ్డుకు మార్కింగ్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. రింగు రోడ్డు మూలంగా తమ భూములు, తండా కోల్పోయి రోడ్డున పడుతామని, తమకు అన్యాయం జరగకుండా చూడాలని ఎమ్మెల్యేను వేడుకున్నారు. ఎరోడ్డు నిర్మించి తమను రోడ్డు పాలు చేయవద్దని గిరిజనులు వాపోయారు. వీలైతే గుడి తండా సమీపం నుంచే రోడ్డు వెళ్లినా నివాసాలకు, ప్రజలకు నష్టం జరగకుండా చూస్తానని, అధైర్య పడవద్దని కసిరెడ్డి హామీ ఇచ్చారు. ఈ విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని చెప్పారు. నాయకులు విజయ్‌రాథోడ్, తావు, చంద్రు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి



శిక్షణలో పాల్గొన్న వివిధ జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు

కడ్తాల్, సెప్టెంబరు 10: ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థి దశ నుంచే పిల్లలకు అవగాహన కల్పిస్తూ ప్రోత్సహించాలని స్కూల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్, రీసెర్చ్ ట్రెనింగ్ సెంటర్ ప్రొఫెసర్ ఎస్.ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. సామాజిక బాధ్యతలపై విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని దిఎర్త్ సెంటర్‌లో కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమం మంగళవారం సాయంత్రం ముగిసింది. కౌన్సిలర్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ పర్యావరణ సంస్థ వ్యవస్థాపకులు లక్ష్మారెడ్డి, అధ్యక్షురాలు లీలాలక్ష్మారెడ్డిల అధ్యక్షతన నిర్వహించిన ప్రొ.ఉపేందర్ రెడ్డి, ఐఎఫ్ఎస్ మోహన్ చంద్ర పర్గేన్, ప్రఖ్యాత పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్. సాయిభాస్కర్‌రెడ్డి, పర్యావరణ ఉద్యమకారులు సురేశ్ గుప్తా, ప్రొఫెసర్ హరిసర్వోత్తమన్, డీఎస్వోలు దేవరాజు, శ్రీనివాసరావులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. స్కూల్ ఎర్త్‌క్లబ్, యంగ్ ఎర్త్ లీడర్స్ కార్యక్రమానికి రంగారెడ్డి, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల వ్యాయామ ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకం ఆవశ్యకత, నీటి పొదుపు, జీవరాశుల పరిరక్షణ గురించి వ్యాయామ ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అనంతరం లీలాలక్ష్మారెడ్డి చేతుల మీదుగా వ్యాయామ ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సీజీఆర్ సంస్థ సభ్యులు, పర్యావరణ శాస్త్రవేత్త డాక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, సీజీఆర్ కో-ఆర్డినేటర్ వెంకటరెడ్డి, ఐఈసీ స్పెషలిస్టు అన్నమయ్య, అడ్మిన్ ఆఫీసర్ అనుదీప్, ప్రోగ్రామ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

మదర్సా నిర్మాణ పనులు నిలిపివేత



నిర్మాణ పనులను అడ్డుకున్న ఇరిగేషన్ ఏఈఈ మాధురీలత

పెద్దేముల్, సెప్టెంబరు 10: కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్ స్థలాన్ని ఆక్రమించుకుని మదర్సా నిర్మాణం పనులు చేపట్టారని ఇరిగేషన్ అధికారులు పనులు నిలిపివేశారు. మండలంలోని మంబాపూర్ గ్రామసమీపంలో మదర్సా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నిర్మాణం కోట్‌పల్లి ప్రాజెక్టు కాలువ స్థలాన్ని ఆక్రమించి కడుతున్నారని గ్రామస్థులు ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఇరిగేషన్ ఏఈఈ మాధురీలత గ్రామాన్ని సందర్శించి మదర్సా నిర్మాణ పనులను పరిశీలించారు. కొలతలు చూసి ఇది కోట్‌పల్లి ప్రాజెక్టు కెనాల్‌కు సంబంధించిన స్థలమని స్పష్టం చేశారు. ఇక్కడ పనులు చేపట్టరాదని నిర్మాణదారులకు సూచించారు. ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించుకుని నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇది ముమ్మాటికి ఇరిగేషన్ స్థలమని, దానిని ఆక్రమించుకుని నిర్మాణం చేపట్టారని అన్నారు. అంతేకాకుండా నిర్మాణానికి సంబంధించి ఎలాంటి అనుమతులు లేవని పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ తెలిపారు. అనుమతుల విషయమై నిర్మాణదారులను ఏఈఈ కోరగా తమవద్ద అనుమతులు ఉన్నాయని చెప్పారని, అనుమతులు ఉంటే నిర్మాణానికి సంబంధించిన పత్రాలు వికారాబాద్ కార్యాలయానికి తీసుకొచ్చి చూపించాలని చెప్పామన్నారు. అన్నీ పరిశీలించాక ఉన్నతాధికారుల ఆదేశానుసారం తదుపరి చర్యలు ఉంటాయని ఏఈఈ వెల్లడించారు.

రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం

చేవెళ్ల, సెప్టెంబరు 10 : రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతామని, ఎవరైనా అక్రమంగా రవాణా చేస్తే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామని జిల్లా పౌర సరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం శంకర్‌పల్లి మండలం మోకిల గ్రామం పరిధిలో నిరుపయోగంగా ఉన్న ఓ పశువుల కొట్టంలో పెద్దఎత్తున అక్రమంగా దాచి ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అక్రమార్కులు నగర శివార్లలోని నిర్మానుష్య ప్రాంతాలను ఎంచుకుని పెద్దఎత్తున బియ్యాన్ని నిల్వ చేస్తున్నారనే సమాచారం ఉందన్నారు. పౌర సరఫరాల శాఖ రాష్ట్ర విజిలెన్స్ బృందంతోపాటు డీటీ హనమా రవీందర్‌నాయక్ స్వాధీనం చేసుకున్న బియ్యానికి పంచనామా చేసినట్లు చెప్పారు. వివిధ శాఖల అధికారులు, పోలీస్‌లు పాల్గొన్నారు.

వంట గదులను పరిశుభ్రంగా ఉంచాలి

తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

కరన్‌కోట్ జడ్పీహెచ్‌ఎస్‌లో ఆకస్మిక తనిఖీ



కరన్‌కోట్ జడ్పీహెచ్‌ఎస్‌లో వంట సరుకులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

తాండూరు రూరల్, సెప్టెంబరు 10: పాఠశాలల్లో వంటగదులను పరిశుభ్రంగా ఉంచాలని తాండూరు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని కరన్‌కోట్ జిల్లా పరిషత్ హై స్కూల్ పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ పాఠశాలలో తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పలు అంశాలపై మాట్లాడారు. అనంతరం సబ్‌కలెక్టర్ సాంఘిక శాస్త్రానికి సంబంధించిన పాఠ్యాంశంలోని భూమి ఆకర్షణశక్తి, గ్రావిటీ గురించి విద్యార్థులకు బోధించారు. బోధనా అంశాలపై హెచ్ఎం రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంట గదిని పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సరుకులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. వంట గది పరిశుభ్రంగా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంట గదిని శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వహకులను ఆదేశించారు. వంట నూనె ప్యాకెట్లు, ఇతర సరుకులను ఆయన పరిశీలించారు. పాఠశాల నిర్వహణ కోసం బాలమణి అనే మహిళలను స్కావెంజర్‌గా నియమించినట్లు పంచాయతీ కార్యదర్శి ఇన్‌చార్జి మండల పంచాయతీ అధికారి ఆనంద్‌రావు సబ్ కలెక్టర్‌కు వివరించారు. పంచాయతీ నుంచి మహిళలను నియమించినా ఎందుకు పని చేయించుకోవడం లేదని, పనులు చేయించుకోవాలన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ ఇన్‌చార్జి అధికారి ఆనంద్‌రావు, తదితరులు ఉన్నారు.

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం : ఎంపీలు ఈటల, కొండా



మాట్లాడుతున్న ఈటల రాజేందర్

శంషాబాద్, సెప్టెంబర్ 10 : దేశాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా శ్రేయస్సే ప్రధానంగా సాగుతున్న పార్టీ భారతీయ జనతా పార్టీ అని మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెడల ల క్ష్మీనారాయణలు అన్నారు. శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అధ్యక్షతన సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ బీజేపీలో చేరేందుకు 8800002024 నెంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి సభ్యత్వం తీసుకోండి, దేశ ప్రగతిలో భాగస్వామ్యమవ్వండని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలు బూత్‌స్థాయిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టాలని సూచించారు. బీజేపీ అధికార ప్రతినిధి వీరేందర్‌గౌడ్, రాష్ట్ర నాయకులు కట్టా వెంకటేశ్, డాక్టర్ ప్రేంరాజ్, టి.అంజన్‌కుమార్, పోరెడ్డి నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, కేఎస్ రత్నం, లచ్చిరెడ్డి, శ్రీరాములు యాదవ్, కడారి జంగయ్యయాదవ్, ప్రభాకర్, ప్రకాష్, బుక్కా వేణుగోపాల్, శ్రీవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, కొత్త అశోక్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు, తదితరులున్నారు.

గౌడ కులస్థులందరూ ఐక్యంగా ఉండాలి



మొయినాబాద్ రూరల్ : మహేష్‌కుమార్ గౌడ్‌ను కలిసిన గౌడ సంఘం నాయకులు

మొయినాబాద్‌రూరల్ /ఆమనగల్లు/శంషాబాద్, సెప్టెంబరు 10: గౌడ కులస్థుందరూ ఐక్యంగా ఉండి పనిచేస్తే ఏ పార్టీలో ఉన్నా పదవులు వరిస్తాయని నూతనంగా ఎన్నికైన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. నూతన పీసీసీ అధ్యక్షుడిగా మహేష్‌కుమార్‌గౌడ్‌ను నియమించిన సందర్భంగా మొయినాబాద్ గౌడ సంఘం నాయకులు మంగళవారం నగరంలోని ఆయన నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను కలిసిన వారిలో గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహగౌడ్, మండలాధ్యక్షుడు అంజయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు సత్యనారాయణ గౌడ్ ప్రధాన కార్యదర్శి ఎల్గని నవీన్‌కుమార్‌గౌడ్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు. అదేవిధంగా మహేశ్ కుమార్‌గౌడ్‌ను కాంగ్రెస్ జిల్లా నాయకుడు జెల్ల రమేశ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల, శాలువాలతో సత్కరించి అభినందించారు. అలాగే మహేష్‌కుమార్ గౌడ్‌ను శంషాబాద్‌కు చెందిన పీసీసీ ఎస్సీ విభాగం ఉపాధ్యక్షుడు జె.నరేందర్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ శంషాబాద్ మండలాధ్యక్షుడు శేఖర్‌యాదవ్, మున్సిపాలిటీ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, కార్యకర్తలు ఉన్నారు.

వినాయక నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు


తాండూరు: వినాయకుల నిమజ్జన ఏర్పాట్లు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్

తాండూరు , సెప్టెంబరు 10: తాండూరు పట్టణంలో కొలువు దీరిన వినాయకులను బుధవారం నిమజ్జనం చేయనున్నారు. నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు చేశారు. సుమారు 300ల వరకు ప్రతిష్ఠించిన వినాయకులను, యాలాల మండలం కోకట్ కాగ్నానది, మల్‌రెడ్డిపల్లి చెరువులో నిమజ్జనానికి, అధికారులు హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు. మున్సిపల్ ఆధ్వర్యంలో కోకట్ కాగ్నానది వద్ద బారికేడ్లు, తాగునీరు, విద్యుత్, సౌక ర్యం ఏర్పాటు చేశారు. కాగ్నానదిని సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న తదితరులు పరిశీలించారు. నిమజ్జనాల వద్ద గజ ఈతగాళ్లను, క్రేన్లను అందుబాటులో పెట్టారు. పాత తాండూరు నుంచి సామూహిక వినాయకుల ఊరేగింపు ప్రారంభం కానుంది. 370 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామని డీఎస్పీ బాల కృష్ణారెడ్డి చెప్పారు.

కీసర రూరల్: నిమజ్జన ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని మల్కాజ్‌గిరి డీసీపీ


కీసర రూరల్: నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మల్కాజ్‌గిరి డీసీపీ పద్మజ

పద్మజ అన్నారు. ఆమె మంగళవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని నాసిన్ చెరువు వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెరువు వ్దకు చేరుకునే దారిలో విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలని, వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయించాలని సూచించారు. చిన్నారులు చెరువు సమీపంలోకి రాకుంగా జాగ్రత్త తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దమ్మాయి గూడ మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత, కుషాయిగూడ ఏసీపీ మహేష్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని నంది వాగు ప్రాజెక్టు దగ్గర వినాయక నిమజ్జనాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్న ట్లు తహసీల్దార్ మనోహరచక్రవర్తి తెలిపారు. మండలంలోని కస్లాబాద్ నందివాగు ప్రాజెక్టులో వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఎస్ఐ అరవింద్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ గోవర్ధన్, బీజేపీ మండల అధ్యక్షుడు లక్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సుభాష్‌గౌడ్, హిందు సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు

కొడంగల్: మండలంలోని హస్నాబాద్ గ్రామంలో వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివరాజ్, హన్మంతు, అశోక్‌కుమార్, సూర్యప్రకాశ్, మారుతి, వెంకటయ్య, శ్రీనివాస్, సంతోష్‌స్వామి, రాఘవేందర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట్: మండలంలోని టేకులపల్లి గ్రామంలో శ్రీ హనుమాన్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణనాథుడికి మాజీ ఎంపీటీసీ మండల అధ్యక్షుడు దాకూరు శ్రీనివాస్‌రెడ్డి దంపతులు, మర్పల్లి నర్సింహారెడ్డి దంపతులు మంగళవారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పురోహితుడు దిలీప్‌కుమార్, హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


కొడంగల్: హస్నాబాద్‌లో వినాయకుడికి పూజలు


వినాయక పూజలో పాల్గొన్న రాంపల్లి, శ్రీనివాస నగర్ కాలనీ, రాయల్ ఫోర్ట్ అసోసియేషన్ సెక్రటరీ పరమేశ్వర్, కాంగ్రెస్ నాయకులు మహిపాల్ రెడ్డి, సురేష్, శర్మ, ప్రసన్న కుమార్, రామకృష్ణ, వేణుగోపాల్

కాంగ్రెస్ నేతపై కమిషనర్ దుర్భాష

తాండూరు, సెప్టెంబరు 10: తాండూరు మున్సిపల్ కమిషనర్ విక్రం సింహారెడ్డి ఫోన్‌లో తనపై దుర్భాషలాడాడని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సుభాన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో వినాయక నిమజ్జనం సందర్భంగా మున్సిపల్ రోడ్లపై గుంతలు ఉన్నాయనివాటిని పూడ్చకపోవడం వల్ల వినాయకుల ఊరేగింపుకు ఇబ్బందులు ఏర్పాడుతాయని కమిషనర్‌కు ఫోన్ చేయగా అడగడానికి నువ్వెవరంటూ దుర్భాషలాడినట్లు తెలిపారు. ఈ విషయమై తక్షణమే శాసన సభ స్పీకర్ ప్రసాద్ కుమార్ స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. పార్టీ పెద్దల ఆదేశంతో ఆయనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదన్నారు.

బ్యాంకులో ఖాతాదారులకు ఇక్కట్లు


ఎస్బీఐలో బారులు తీరిన ఖాతాదారులు

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 10: బొంరాస్‌పేట్ ఎస్బీఐ బ్యాంకులో సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లావాదేవీల కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొందని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బ్యాంకులో సరైన సిబ్బందిని నియమించి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.

పాఠశాలలకు మహర్దశ

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 10: మండలంలో పాఠశాలలకు మహర్దశ రానుంది. కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి మండలంలోని బురాన్‌పూర్, తుంకిమెట్ల, బొంరాస్‌పేట్, చౌదర్‌పల్లి, బాపల్తిండా, ఏర్పుమళ్ల గ్రామాలను మంగళవారం సందర్శించారు. మండల కేంద్రంతో పాటు బురాన్‌పూర్, చౌదర్‌పల్లి పాఠశాలలకు నాలుగు చొప్పున అదనపు తరగతి గదుల నిర్మాణానికి హామీ ఇచ్చారు. బొంరాస్‌పేట్, బాపల్లితండా, చౌదర్‌పల్లి గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూర్ చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకరవాణి ప్రాజెక్టును ప్రజాప్రతినిధులతో కలిసి సందర్శించి పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహులు గౌడ్, నాయకులు వెంకట్రాములుగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే మల్లారెడ్డి



మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవల్లి ఫాంహౌజ్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. - మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 10

చాకలి ఐలమ్మ పోరాట పటిమ మరువలేనిది

పరిగి, సెప్టెంబరు 10: నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి వెనుకబడిన తరగతుల్లో సామాజిక చైతన్యం రగిలించిన చాకలి ఐలమ్మ పోరాట పటిమ మరువలేనిదని అని పరిగి మాజీ ఎమ్మెల్యే కె.మహేష్‌రెడ్డి అన్నారు. వీరవనిత చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి వేడుకలు ఆయా పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిర్వహించారు. కోర్టు సమీపంలో ఉన్న ఐలమ్మ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే వర్ధంతి లోపు పరిగిలో విగ్రహన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. అదేవిధంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.వెంకటయ్య ఆధ్వర్యంలో కూడా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్; మాజీ ఎంపీపీ అరవింద్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

కులకచర్ల: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సొసైటీ చైర్మన్ మొగులయ్య రజక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు, అంజిలయ్య గౌడ్ పాల్గొన్నారు.

తాండూరు: తెలంగాణ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా మంగళవారం గుమస్తానగర్‌లో


పరిగి: చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, తదితరులు

ఐలమ్మ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్ పాల్గొన్నారు.

ధారూరు: తెలంగాణ పోరాటయోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు లక్ష్మయ్య, అంజయ్య, మహేష్ పాల్గొన్నారు.

పెద్దేముల్: మంబాపూర్‌లో సాయుధపోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని రజకసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంబాపూర్ గ్రామపంచాయతీ ఆవరణలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి పలువురు నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యాలటి శ్రీనివాస్, వెంకటయ్య, దత్తు పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మేడ్చల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రంధాలయం చౌరస్తా వద్ద గల ఐలమ్మ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విదంగా పట్టణంలోని రజక సంఘం నాయకులు ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్ గౌడ్, సంతోష్ గౌడ్, సుదర్శన్ రెడ్డి, శంకర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ రాజీవ్ గృహ కల్ప కాలనీలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు చింతల యాదయ్య ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సరిత, అరుణ, సునిత, శోభ, సరళ పాల్గొన్నారు.

కీసర: చాకలి ఐల్లమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల పరిధి కీసర, కరీంగూడ, చీర్యాల్ గ్రామాల్లో ఐల్లమ్మ విగ్రహాలకు పలువురు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలి


నిరసన తెలుపుతున్న మేడ్చల్ జూనియర్ కళాశాల విద్యార్థులు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 10: కళాశాలలో మూడు నెలల క్రితం బదిలీపై వెళ్లిన లెక్చరర్ల స్థానంలో తరిగి కొత్త వారిని నియమించాలని మేడ్చల్ జూనియర్ కళాశాల విద్యార్థులు నిరసనకు దిగారు. మంగళ వారం కళాశాల ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు పలుకుతూ కళాశాల ప్రిన్సిపాల్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ రాథోడ్ పాల్గొన్నారు.

బషీరాబాద్ మాజీ జడ్పీటీసీ మృతి


లక్ష్మీబాయి(ఫైల్)

బషీరాబాద్, సెపెంబర్ 10: మండలంలోని మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి(82) సోమవారం రాత్రి మృతి చెందారు. వృద్ధాప్యంతో పాటు ఇటీవల అనారోగ్యానికి గురైన ఆమె గత కొంతకాలంగా చికిత్స పొందుతుంది. సోమవారం రాత్రి తీవ్ర అస్వస్థతకు గురికాగా హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించే యత్నంలో మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. లక్ష్మీబాయి మండల ఎంపీపీగా, జడ్పీటీసీగా రెండుసార్లు ఎన్నికయ్యారు. ఆమె అంత్యక్రియలు స్వగ్రామమైన బషీరాబాద్ మండలం జమ్లానాయక్‌తండాలో మంగళవారం సాయంత్రం పూర్తిచేశారు.

పంచాయతీల రికార్డుల స్వాధీనం


రికార్డులను స్వాధీనం చేసుకుంటున్న కమిషనర్

కీసర, సెప్టెంబరు 10: మున్సిపాలిటీలో విలీనమైన గ్రామపంచాయతీ రికార్డులను మున్సిపల్ కమిషనర్లు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కీసర, అంకిరెడ్డిపల్లి, చీర్యాల్, నర్సంపల్లి, తిమ్మాయిపల్లి గ్రామపంచాయతీల్లోని రికార్డులు క్యాష్‌బుక్, డిమాండ్ బుక్‌లతో పాటు పలు చిట్టాపదులు, ఇతర పుస్తకాలను దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ నాగమణి స్వాధీనం చేసుకున్నారు. గోధుమకుంట, కరీంగూడ, భోగారం, రాంపల్లి దాయర పంచాయతీల రికార్డులను నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రప్రసాద్ స్వాధీనం చేసుకొని బీరువాలో భద్రపరిచారు. అదేవిధంగా గ్రామపంచాయతీ కార్యాలయాలపై ఉన్న పేర్లను తొలగించి, మున్సిపల్ కార్యాలయం బోర్డులను అతికించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బషీరాబాద్, సెప్టెంబరు 10: లబ్ధిదారులకు నేడు(బుధవారం) తాండూరులో ఎమ్మెల్యే చేతులమీదుగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేయనున్నట్లు తహసీల్దార్ వై.వెంకటేష్ తెలిపారు. మండలానికి 23 చెక్కులు వచ్చాయని ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

● **కొడంగల్ రూరల్:** ఈనెల 11 నుండి 17వ తేదీ వరకు జరిగే తెలంగాణ రైతాంగా సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ కొడంగల్ నియోజకవర్గ కార్యదర్శి ఎండీ మహమూద్ పిలుపునిచ్చారు. మంగళవారం కొడంగల్‌లో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 11వ తేదీ నుంచి 17వ తేదీ వరకు కొడంగల్ నియోజకవర్గ కార్యాలయంలో వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నాయకులు బషీర్ అహ్మద్, శ్యాంసుందర్, ఎం.రాజు, ఎండీ.రహీం తదితరులు పాల్గొన్నారు.

● **పరిగి:** పొల్కంపల్లిలో మంగళవారం మహవీర్ జనరల్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. రోగులకు చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా గ్రామకార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ఉచిత వైద్యసేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వీరేశం, నాయకులు మల్లేశం, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **బొంరాస్‌పేట్:** మెట్లకుంట పీఏసీఎస్ సొసైటీకి అత్యధిక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరిస్తామని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన రైతు సొసైటీల చైర్మన్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో మెట్లకుంట పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ మహబూబ్‌నగర్ డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సెక్రటరీ రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

● **కులకచర్ల:** ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ పోరాటం చేస్తుందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డి అన్నారు. కులకచర్ల పీఆర్టీయూ మండల సర్వసభ్య సమావేశాన్ని మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా పీఆర్టీయూ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. కులకచర్ల మండల అధ్యక్షుడిగా వల్లూరి రాఘవేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బస్వరాజు, గౌరవ అధ్యక్షుడిగా నర్సింహులును ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, సొసైటీ చైర్మన్ మొగులయ్య, భరత్‌కుమార్, ఆనంద్, బుగ్గయ్య, రాకేశ్, హనుమంతు, కేశవులు, గులాం, పరందాములు, జైపాల్‌రెడ్డి, దేవి, శరత్‌కృష్ణ పాల్గొన్నారు.

● **కులకచర్ల:** మండలంలోని పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనానికి రావాలని స్థానిక బీజేపీ నాయకులు మెదక్ ఎంపీ రఘునందన్‌రావును కోరారు. వికారాబాద్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. ఈసందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు సురేశ్, నాయకులు గోవింద్‌నాయక్, మైపాల్, చంద్రలింగం, రామచంద్రయ్య తదితరులు కలిశారు.

● **మేడ్చల్ టౌన్:** మేడ్చల్ మున్సిపాలిటీలో విలీనం చేసిన పూడూరు పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి కమిషనర్ నాగిరెడ్డి, డీఈఈ విజయలక్ష్మితో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

● **వికారాబాద్:** వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ సబ్జెక్టులో గెస్ట్‌లెక్చరర్ పోస్టులను భర్తీ చేయడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. గీతాలక్ష్మీపట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7702328240, 8341891845 అని సంప్రదించాలన్నారు.

● **దోమ:** మండలంలోని బొంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి మీనాగడ్డి మందు పిచికారి చేయించారు. ప్రతీ ఒక్కరూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

● **కొడంగల్:** జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లిమిటెడ్ మహబూబ్‌నగర్ వారు మంగళవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన నూతన ఎండీసీసీబీ అధ్యక్షుడు మామిళ్ల విష్ణువర్ధన్‌రెడ్డిని కొడంగల్ మండలంలోని హస్నాబాద్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ శివకుమార్‌గుప్త సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

● **పరిగి:** సేవాలాల్ సేన జిల్లాలో ఆవిర్భంచి పదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం పరిగిలో సేవాలాల్ సేన జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జటావత్ శంకర్, బాలకృష్ణ, గౌరవ అధ్యక్షులు రవినాయక్‌లు సమావేశమయ్యారు. సేవాలాల్ స్ఫూర్తితో గిరిజనుల హక్కుల కోసం నిరంతరం పనిచేస్తున్నట్లు తెలిపారు. సంఘం నాయకులు మోహన్, పాల్య, అంగూర్, బాబ్యానాయక్ పాల్గొన్నారు.

● **తాండూరు:** ఆదర్శనగర్ కట్ట మైసమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మ వారికి రుద్రాభిషేకం, మహిళలచే లలితా సహస్ర పారాయణం నిర్వహించారు. పట్టణంలోని పలు కాలనీలకు చెందిన మహిళలు అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి కుంకుమ అర్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. వేడుకలలో ఆలయ వ్యవస్థాపకులు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విఠల్ నాయక్, కౌన్సిలర్ నీరజ బాల్‌రెడ్డి, మున్సిపల్ మేనేజర్ నరేందర్ పాల్గొన్నారు.

వికారాబాద్: అపోలో ఫార్మసీ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి షేక్ అబ్బుస్ సుభాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం వికారాబాద్‌లో ఈనెల 12న ఉదయం 10.30గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు 9676047444 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

● **కులకచర్ల:** ముజాహిద్‌పూర్‌లో మత్స్య సహకార సంఘం సభ్యులు వేముల ఎల్లమ్మ(80) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందగా ఆయన అంత్యక్రియలకు గ్రామమత్స్య సహకార సంఘం తరఫున రూ.5వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు, అనంతయ్య, పాల్గొన్నారు.

● **మేడ్చల్ టౌన్:** తెలంగాణ ఎయిడ్స్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం కళాజాత కళాకారుల బృందం మేడ్చల్ ఆర్టీసీ డిపో ఆవరణలో, పూడూరులో అవగాహన హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. వైఆర్‌జీ స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రామిరెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అప్పు తీర్చాలని వేధించిన వ్యక్తికి మూడేళ్లు జైలు

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 10: మధ్యవర్తిగా ఉండి ఇప్పించిన అప్పు తిరిగి చెల్లించాలని వేధించి వ్యక్తి మృతికి కారణమైన ఓ నిందితుడికి మేడ్చల్ న్యాయస్థానం మూడేళ్ల జైలుశిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చింది. మేడ్చల్ అసిస్టెంట్ సెషన్ జడ్జి కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణ మూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సూరారం గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ తన మిత్రుడు వెంకటేష్‌కు 2012లో రూ.3లక్షలు జమానతుగా ఉండి అప్పు ఇప్పించాడు. వెంకటేష్ ఆర్థిక పరిస్థితులు బాగాలేకపోవటంతో తిరిగి సకాలంలో డబ్బులు చెల్లించలేకపోయాడు. దీంతో వెంకటేష్‌ను విజయ్‌కుమార్ మానసికంగా హింసించడంతో అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో వెంకటేష్ కుటుంబసభ్యులు సురారం పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసునమోదు చేసి న్యాయస్థానం ముందు నిందితుడిని హాజరుపరచగా వాదోపవాదాలు విన్న మేడ్చల్ అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి అజయ్‌కుమార్‌జాదవ్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్షతో పాటు, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు పీపీ కృష్ణమూర్తి తెలిపారు.

ఎల్లమ్మ ఆలయంలో చోరీ

● బంగారు, వెండి ఆభరణాలు అపహరణ

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 10: ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని లక్మాపూర్ గ్రామంలోని ఎల్లమ్మ ఆలయంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లక్మాపూర్ గ్రామ పరిధిలో ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయంలో అర్చకులు రోజువారి లాగే పూజలు నిర్వహించి అనంతరం అలయానికి తాళం వేసి వెళ్లారు. కాగా అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు ఆలయ ప్రధాన ద్వారానికి వేసిన తాళాన్ని విరగొట్టి ఆలయంలోకి చొరబడి సూమారు రూ.లక్షా 50వేలు విలువ చేసే బంగారు ఆభరణాలను (అమ్మవారి ముక్కు పుడక, శఠగోపం, పళ్ళెం, కిరీటాలు) అపహరించారు. సోమవారం ఉదయం ఆలయ అర్చకులు వచ్చి చూడగా ఆలయానికి ఉన్న రెండు ప్రధాన ద్వారాల తాళాలు పగలగొట్టి ఉండడంతో అనుమానం వచ్చి లోపలికి వెళ్లిచూడగా అమ్మవారి ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఆలయంలో చోరీ జరిగిందని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


చికిత్స పొందుతూ వివాహిత మృతి

దోమ, సెప్టెంబరు 10: దయాదులు మందలించారని మనస్తాపానికి గురైన ఓ వివాహిత క్రిమిసంహారక మందు తాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని దిర్సంపల్లి అనుబంధ గ్రామం అనంతరెడ్డిపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతరెడ్డిపల్లికి చెందిన గండీడ్ సుశీల(27) వారి దయాదులైన మధుసూదన్‌రెడ్డి కూతురు ఓ వ్యక్తితో వెళ్లిపోయింది. విషయంలో సుశీల సహకరించిందని మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఆమెపై గతంలో క్రిమినల్ కేసు నమోదు చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఐదు నెలలుగా మధుసూదన్‌రెడ్డి కుటుంబసభ్యులు తనను అవమానిస్తున్నారని సుశీల భర్త భరత్‌సింహారెడ్డి చెబుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురైన సుశీల ఈనెల 6వ తేదీన పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను చికిత్స నిమిత్తం వికారాబాద్‌లోని మిషన్ ఆస్పత్రికి తరలించి అక్కడి నుంచి హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందింది. తన భార్య సుశీల మృతికి కారణమైన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని భర్త భరత్‌సింహారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్‌కుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి గాయాలు

పరిగి, సెప్టెంబరు 10: ఎదురుగా వస్తున్న బైక్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరి విద్యార్థులకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ప్రమాదం మంగళవారం సాయంత్రం జరిగింది. బొంరాస్‌పేట్ మండలం బురాన్‌పూర్‌తండాకు చెందిన అనిల్, శ్రీనివాస్‌లు పరిగిలోని ఓ కళాశాలలో ఇంటర్ చదువుతున్నారు. కళాశాల ముగిశాక ఇద్దరు బైక్‌పై వెళుతుండగా మార్గమధ్యలో గడిసింగాపూర్ దగ్గర కోడంగల్ వైపు నుంచి ఎదురుగా వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. బైక్‌పై ఉన్న అనిల్, శ్రీనివాస్‌లకు తీవ్రగాయాలు కావడంతో వారిని పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇద్దరి కాళ్లు విరగడంతో మెరుగైన వైద్యం కోసం నగరానికి తరలించారు.

వ్యక్తి అదృశ్యం


నాగరాజు

మూడుచింతలపల్లి, సెప్టెంబరు 10: ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మూడుచింతలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు (36) వెల్డింగ్ దుకాణం నిర్వహించుకుంటూ తన భార్య రేణుకతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. వెల్డింగ్ షాపు నిర్వహణకు నాగరాజు సుమారు రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. ఈ క్రమంలో అప్పుల బాధతో మద్యానికి బానిసై భార్యతో తరచూ గొడవపడేవాడు. వీరి గొడవ పోలీస్‌స్టేషన్ వరకూ వెళ్లగా చివరకు రాజీ కుదుర్చుకున్నారు. అనంతరం గతనెల 24వ తేదీన సుమారు 9గంటలకు బయటకు వెళ్లిన నాగరాజు తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబసభ్యుల వద్ద, చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బస్ కండక్టర్‌పై చేయిచేసుకున్న యువకుడిపై కేసు

ధారూరు, సెప్టెంబరు 10: విధినిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్ కండక్టర్‌ను దూషించి చేయిచేసుకున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పరిగి మండలం మిట్టకోడూర్ గ్రామానికి చెందిన సునీత వికారాబాద్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తోంది. వికారాబాద్-తాండూర్ బస్‌లో సోమవారం సాయంత్రం ఆమె విధులు నిర్వహిస్తుండగా వికారాబాద్‌లో స్టేషన్ ధారూరుకు చెందిన యువకుడు వి.బాలు బస్ ఎక్కాడు. తాండూర్‌కు టికెట్ అడగగా ఆమె టికెట్ ఇచ్చింది. ధారూరు సమీపంలోకి బస్ రాగానే బాలు తనకు డబ్బులు ఇవ్వాలని కండక్టర్ సునీతను అడిగాడు. దీంతో తాండూర్ టికెట్ తీసుకున్నావు కదా అక్కడే ఇస్తానని కండక్టర్ చెప్పటంతో బాలు ఆగ్రహంతో ఆమెపై దుర్భాషలాడాడు. అంతటితో ఆగకుండా కండక్టర్ చెంపపై లాగి కొట్టి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. విధి నిర్వహణలో ఉన్న తనను దూషించి, చేయిచేసుకున్న బాలుపై చర్య తీసుకోవాలని సోమవారం రాత్రి సునీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు నిందితుడు బాలుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుచితంగా వ్యవహరించిన వ్యక్తి రిమాండ్

ధారూరు, సెప్టెంబరు 10: మద్యం సేవించకూడదని వారించిన పోలీసు సిబ్బందిపై అనుచితంగా వ్యవహరించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల 8వ తేదీన ఆదివారం కోట్‌పల్లి ప్రాజెక్టు ప్రాంతంలో బహిరంగ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న కేశంపేట మండలానికి చెందిన శివకుమార్‌ను పోలీసు సిబ్బంది వారించారు. ఇక్కడ మద్యం సేవించకూడదని సూచించిన పోలీసు సిబ్బందిపై శివకుమార్ అనుచితంగా ప్రవర్తించారని ఎస్ఐ వివరించారు. నిందితుడు శివకుమార్‌ను అరెస్టు చేసి మంగళవారం కోర్టులో హాజరుపర్చగా మేజిస్ట్రేట్ రిమాండు విధించినట్లు ఆయన తెలిపారు.

పెద్దేముల్ మీదుగా రైల్వేలైను ఏర్పాటు చేయండి

పెద్దేముల్, సెప్టెంబరు 10: జహీరాబాద్‌కు కొత్తగా మంజూరైన రైల్వేలైను పెద్దేముల్ మీదుగా ఏర్పాటు చేయాలని కోరుతూ కేపీసీసీ ఉపాధ్యక్షుడు సుభాష్‌రాథోడ్, టీపీసీసీ మైనార్టీ డిపార్ట్‌మెంట్ రాష్ట్రకన్వీనర్ రియాజ్‌లు బీదర్ ఎంపీ సాగర్‌ఖండ్రేను చించోళిలో కలిసి వినతిపత్రం అందజేశారు. తాండూరు నుంచి జహీరాబాద్‌కు మంజూరైన కొత్త లైన్ పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్, పెద్దేముల్‌తో పాటు కర్ణాటకలోని కుంచారం మీదుగా ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మన్నెగూడ నుంచి తాండూరు- జహీరాబాద్- బీదర్‌రోడ్డును పెద్దేముల్ మీదుగా జాతీయరహదారి నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహులు, కస్తూరి వెంకట్‌రెడ్డి, సవారి నర్సింహులు పాల్గొన్నారు.

అదనపు బస్సులు నడిపించాలి


ధర్నా చేస్తున్న విద్యార్థులు

పరిగి, సెప్టెంబరు 10: పరిగి నుంచి కిష్టాపూర్‌కు అదనపు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కోరుతూ పాఠశాల, కళాశాల విద్యార్థులు మంగళవారం గడిసింగాపూర్ దగ్గర రోడ్డుపై బైఠాయించిన నిరసన వ్యక్తం చేశారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు లేక నానా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. విద్యార్థుల సమయపాలనకు అనుగుణంగా బస్సులు నడిపించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పరిగి, గడిసింగాపూర్ మీదుగా కిష్టాపూర్‌కు సరిగ్గా బస్సులులేవని వాపోయారు. విద్యార్థుల ఆందోళన గురించి తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడతామని విద్యార్థులను సముదాయించి ఆందోళనను విరమింపజేశారు.